# గాయం

-రాధేయ

దైనందిన జీవితంలో ఆకస్మికంగా కొన్ని యదార్థ సంఘటనలు కళ్ళ ముందు జరిగినపుడు ఏమీ చెయ్యలేని అశక్తత..

ఆ క్షణంలో మనసు దీనంగా మూల్గుతుంది.

అసహాయత ఎదుటి వారిపై సానుభూతిగా మారుతుంది.

సానుభూతి గాయాన్ని కెలుకుతుందే గానీ బాధను మాన్పలేదు.

ఓ వాస్తవ దృశ్యం, ఓ యదార్థ సంఘటన ఓ రోజు నా కళ్ళ ముందే జరిగితే, చేష్టలుడిగి మ్రాన్పడిపోయాను. తేరుకునే సరికి సమయం మించిపోయింది.

ఆ దృశ్యం ఇప్పటికీ కళ్ళముందు కొచ్చి గుండెను మెలిపెడుతూనే వుంటుంది.

ఆ రోజు ఒక అత్యవసర పనిమీద కడప వెళ్ళాల్సి వుంది.

స్కూలుకు సెలవు పెట్టాను.

కడపలో ఆఫీసు పని చూసుకొని, సాయంత్రం ఒక సాహిత్య సభలో పాల్గొనవలసి వుంది.

ఉదయం పది గంటలకల్లా కడప బస్సు కోసం బస్టాండులో ఎదురు చూస్తూ నిలబడ్డాను.

పదిన్నరకల్లా "అనంతపురం - కడప" బస్సు వచ్చి ఆగింది.

ఆగిందే తడవుగా ఎక్కి సీటు సంపాదించుకొని కూర్చున్నాను.

నేనూహించినంత రద్దీగా లేదు.

సీట్లకు సరిపోయేంత మంది మాత్రమే వున్నారు.

ఇంతలో ఓ వ్యక్తి రెండు అరమూటల్ని భుజాన అవలీలగా వేసుకొని వచ్చి బస్సులో వేశాడు.

కండక్టరు లగేజి వద్దని వారిస్తున్నా లెక్కపెట్టలేదు.

అయితే ఆ మూటల్ని ఎవరికీ ఇబ్బంది కల్గకుండా సీటు కిందికి తోయడంతో కండక్టరు ఇంకేం మాట్లాడ లేకపోయాడు.

ఆ వ్యక్తిని నింపాదిగా ఎగాదిగా చూశాను.

వయస్సు ముప్పై అయిదుకు మించి వుండదు. బక్కపలుచగా వున్నాడు. వేసుకున్న చొక్కా భుజమ్మీద, వీపుమీద మాసికలు పడి చిరిగిపోయి వుంది. ఆ చిరుగుల్లోంచీ లోపల వేసుకున్న ఎర్ర బనీను కనిపిస్తూ వుంది. కళ్ళు లోతుకుపోయి, ముఖమంతా పీక్కుపోయి నట్లుగా వుంది. అటువంటి మనిషి ఆ మూటల్ని సునాయాసంగా బస్సులోకి వెయ్యడం చూస్తే నాకు ఆశ్చర్య మేసింది.

ఏమైతేనేం, కూర్చునేందుకు చోటు సంపాదించుకున్నాడు.

నెత్తికి చుట్టుకున్న తుండుగుడ్డతో ముఖమంతా తుడుచుకొని నీరసంగా సీట్లో కూలబడ్డాడు.

నేను అతని పక్క సీటులోనే కూర్చున్నాను.

ఎందుకోగానీ ఆ వ్యక్తి బస్సులో ప్రవేశించినప్పటి నుంచీ అతణ్ణి గమనిస్తూనే వున్నాను.

నా ఆలోచనల్తో నిమిత్తం లేనట్లుగా బస్సు బయల్దేరింది.

బస్టాండు లోపల్నుంచి బయటికొచ్చి కడప రోడ్డు వైపుకు మలుపు తిరిగింది.

క్రాసింగ్‌లో మరికొంత మంది ప్యాసింజర్లు ఎక్కారు.

తాలూకా పోలీస్‌స్టేషన్ దగ్గర ఇద్దరు పోలీస్ కానిస్టేబుల్స్ ఎక్కారు.

బస్సు తాడిపత్రి టౌన్ దాటి మెల్లమెల్లగా స్పీడందుకొంటూంది.

టౌన్ దాటి రెండు కిలోమీటర్లు వస్తే ఓ మర్రిచెట్టు, సత్రం వస్తుంది.

అక్కడికి రాగానే ఇద్దరు వ్యక్తులు రోడ్డుకు అడ్డంగా నిలబడి బస్సును ఆపమన్నట్లుగా చేతులు ఊపారు.

ప్యాసింజర్స్ కదా! తప్పదన్నట్లుగా బస్సును పూర్తిగా స్లో చేశాడు డ్రైవర్.

ఆ వ్యక్తులిద్దరూ హడావుడిగా ఎక్కేశారు.

నేను అంతవరకూ చదువుతున్న పేపరును పక్కనబెట్టి వారిని పరికించి చూశాను.

తెల్లటి ఖద్దరుకు గంజిపెట్టి ఇస్త్రీ చేసిన చొక్కాలు. అంతే తెల్లటి పంచలు బెత్తెడంచు పేటుతో వున్నాయి. మీసాలు తెగబలిసి ఉన్నట్లుగా గుబురుగా సుడితిరిగి వున్నాయి.

ఇద్దరికీ వయసు యాభైకి పైగా అరవైకి లోపలా వుండవచ్చు.

ఒకడేమో భారీ కాయంతో ఎత్తుగా వున్నాడు.

మరొకడు అట్టే పొడుగులేడు.

వారిద్దర్నీ చూస్తుంటే ఒకడేమో అసెంబ్లీ రౌడీ, మరొకడు వీధిరౌడీలా వున్నాడు.

మొదటి వ్యక్తి చేతుల్లో ఏమీలేదు.

కానీ రెండవ వ్యక్తి చేతుల్లో నల్లటి జిప్ బ్యాగు వుంది.

అందులో ఏముంటాయో, రాయలసీమ ఫ్యాక్షన్‌లో జీవించే వారెవరికైనా తెల్సు.

ఆ జిప్ బ్యాగును రెండవవాడు చాలా జాగ్రత్తగా పట్టుకున్నాడు. అప్పటికే బస్సు నిండుగా ఉంది కాబట్టి సీట్ల కోసం వారి కళ్ళు వెతుకుతున్నాయి. ఎక్కడా సీటు లేదు.

మొదటి వ్యక్తి నా ప్రక్కన సర్దుకొని కూర్చున్నాడు.

రెండవ వ్యక్తి నా వెనుక సీటులో సర్దుకున్నాడు.

బస్సు ముందుకు సాగిపోతూ వుంది.

అనుకోకుండా నా చూపు పక్కసీటులో ఎర్ర బనియను వ్యక్తి మీద నిలిచాయి.

అంతవరకూ నీరసంగా, నిశ్చింతగా కూర్చున్న ఆ మనిషి బస్సులో ఎక్కిన ఈ ఇద్దరు శాల్తీలను చూసి ఉలిక్కిపడి వారికి కన్పించకుండా తల పక్కకు తిప్పుకున్నాడు.

మనిషి కన్పించకుండా ఒదిగిపోయి కూర్చున్నాడు.

నాకెందుకో విషయం అంతుచిక్కకుండా వుంది.

నేను కూడా చూపు మార్చి నా పక్కలో కూర్చున్న వ్యక్తివైపు చూశాను.

అతను రెప్పవాల్చకుండా బస్సంతా కలియచూస్తున్నాడు.

ఆ వెనుకవైపు కూర్చున్న ఇద్దరు కానిస్టేబుళ్ళు నైట్ డ్యూటీ చేశారేమో కునికిపాట్లు పడ్తున్నారు.

ఇంతలో నా పక్కలో కూర్చున్న వ్యక్తి కళ్ళు పక్కసీటులోని ఎర్ర బనియను వ్యక్తిమీద పడ్డాయి.

అంతే!! నెత్తిన పిడుగు పడినట్లయింది. బిక్కమొగం వేసి గడగడ వణుకుతూ లేచి నిల్చున్నాడు.

"దండాలయ్యా! దండాలు రెడ్డీ! కూలి పని కోసం ఏరే దేశం పోయి వచ్చినానయ్యా" అంటూ దీనంగా ముఖంబెట్టి సంజాయిషీ ఇచ్చుకున్నట్లుగా చెప్పుకుపోతున్నాడు.

"ఒరేయ్! ఈరిగా, ఎంత కండకావరంరా నీకు, నా ఎదురుగా సీటులో కూర్చోవడమే కాకుండా, నేనంటే లెక్కా జమా లేనట్టు నదుసుకుంటావా"

ఆవేశంతో ఊగిపోతున్నాడు. వెనుక వైపు కూర్చున్న వ్యక్తి బిగ్గరగా "రేయ్ డ్రైవర్, బస్సాపు..." అంటూ గద్దించాడు.

బస్సులో ఎవరి లోకంలో వాళ్ళున్న ప్యాసింజర్లంతా ఒక్కసారిగా ఉలిక్కిపడి సర్దుకున్నారు.

డ్రైవర్ కూడా ఉలిక్కిపడి వెనక్కి చూసి బండిని స్లో

## హైకూలు

మేఘపు జల్లు
మొలకెత్తే విత్తుకు
ఉడత సాయం

చుక్కల చీర
అమావాస్య ఆకాశం
అందాల బొమ్మే (!)

తమలపాకు
పెదవులు పండించే
వలపు సేద్యం

పసిపిల్లలు
విరిసే విరియని
నవ్వే పువ్వులు

అమృత తుల్యం
అప్పుల రైతులకు
పురుగు మందు(!)

పచ్చని పంట
కంటికి దొరకదేం
అంతా కరువే

ఆమె గుప్పెట్లో
తారలు ఒదిగాయి(?)
గోరింట పూత

-టి. శోభనబాబు

చేశాడు.

“రేయ్, డ్రైవర్‌గా! చెప్పేది నీక్కాదూ! మర్యాదగా ఆపుతావా లేక నీకూ కాలి తన్నులు కావాలా” ఆ ఇద్దరు గుడ్లురుముతూ డ్రైవర్ వైపు చూస్తూ సంజ్ఞ చేశారు.

అంతే!! ఒక్కసారిగా సడన్ బ్రేకుతో బస్సాగిపోయింది.

అందరూ ఒక్కసారిగా తమ సీట్లలోంచీ నిక్కి చూశారు.

కునుకు తీస్తున్న కానిస్టేబుల్స్ ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచి తమ సహజ ధోరణిలో “ఏయ్, ఏమైంది. ఇక్కడ బస్సెందుకు ఆపారు”

“ఏమీ లేదు గానీ, మీరు మర్యాదగా నోర్మూసుకొని కూర్చోండి లేదా దిగిపొండి, ఇందులో జోక్యం కల్పించు కోవద్దు. కల్పించుకున్నారో మీ పెళ్ళాల ముఖం చూళ్ళేరు” అని ఆ ఇద్దరూ గద్దించగానే మారు మాట్లాడకుండా సీటులో చతికిలబడ్డారు.

“రేయ్, లంజకొడకా! రారా ఇట్లా” అంటూ ఎర్ర బనియను వేసుకున్న వ్యక్తిని ఒకడు జుట్టు పట్టుకొని మొదటి వ్యక్తి దగ్గరకి తెచ్చి నిలబెట్టాడు.

“ఏరా! ఎవడబ్బ సొమ్మని నా లెక్క ఎగరగొట్టి, నా పనులు చెయ్యకుండా పెళ్ళాం బిడ్డలతో పరారైపోతావా నా కొడకా. ఎన్ని గుండెలురా నీకు?”

“ఎప్పుడైనా నాకు చిక్కకపోతావా, నీ రక్తం కళ్ళ చూడకపోతానా అని కాసుకున్నానురా, ఈరోజు దొరికావు, ఇంకెక్కడికి పోతావ్‌రా నా కొడకా, నా బాకీ తీర్చకుండానే నీ యబ్బ చచ్చిపోయినాడు, నువ్వేమో పెళ్ళాం బిడ్డలతో ఊరిడ్సిపోతే మేమేం ఎదవ నా కొడుకులమా చూస్తూ ఊరుకుండేదానికి.”

“దొరా రచ్చించు, కాపాడు దొరా.. పొరపాటైపోనా దయ్యా, నీ పని చేసి నీ బాకీ సెల్లకొడతా దొరా, నన్ను నమ్ము దొరా” అంటూ కాళ్ళా వేళ్ళా పడి గోడు గోడున విలపిస్తూన్న వాడిని, ఒకడు కాళ్ళతో ఎగిసి తన్నుతూ వుంటే మరొకడు బలం కొద్దీ చెంపల మీద బాదు తున్నాడు.

బస్సులోని పాసింజర్లంతా ప్రేక్షకుల్లా చూస్తున్నారే తప్ప, “ఎందుకూ, ఏమిటీ” అని ఒక్కరు కూడా ప్రశ్నించిన పాపాన పోలేదు.

నాకు మాత్రం విషయం అర్థమైనట్లే తోచింది.

వీడు ఆ మోతుబరికి పాలేరుగా వుండి ఉంటాడు.

“దొంగ నా కొడకా, నిన్ను నమ్మేదెవర్రా, నువ్వే కాదు నీ పెళ్ళాన్ని తాకట్టు పెట్టినా నా అప్పు తీర్చలేవురా”

“లేద్దొరా ఈసారికి శమించండయ్యా, నేనెక్కడికీ పోను నీ కళ్ళెదురుగానే ఉంటా దొరా నన్ను నమ్ము..” ఊరికి పోయి భార్యాబిడ్డల్ని పిల్సుకోని రేపే మనూరికి వస్తాం దొరా” అని ఎంతగా వాడు ప్రాధేయపడ్తున్నా - వాళ్ళు కాలి తన్నులు, పిడిగుద్దులు ఏమాత్రం ఆపలేదు.

అసలే బక్క ప్రాణం, శక్తిలేక కుప్పకూలిపోతున్నా వినకుండా జుట్టుపట్టుకొని ఈడ్చి, ఈడ్చి తన్నుతూంటే.

ఎవ్వరూ నోరెత్తలేదు.

పక్కలోనున్న నేను వాళ్ళ చేతులు పట్టుకొని వారించ బోయాను.

“మీకు తెల్దు సార్. ఇది మా ఊరి విషయం. మీరు ఊరుకుంటే మీ మర్యాద నిలబడ్తుంది” అంటూ నావైపు గుర్రుగా చూశాడు.

అంతే!! పట్టు సడలించి కూర్చున్నాను.

వారి తన్నులూ, గుద్దులూ, బండబూతులూ ఏమాత్రం ఆపకుండా యథేచ్ఛగా వాడి శరీరాన్ని కుప్పకూల్చేస్తు న్నారు.

ఆ తన్నులకూ, తోపులకూ బస్సులో సీట్లకు కడ్డీలపై బడి తల పగిలి రక్తం కారుతోంది.

“నా కొడకా, ఈ రోజు నీ ప్రాణం తీస్తాం ఎవరడ్డమొ స్తారో రమ్మను. కులం తక్కువ నా కొడుకులకింత మకురా!” అవసరమొచ్చినప్పుడల్లా అయ్యా, అమ్మా అని కాళ్ళా వేళ్ళా పడి డబ్బు తీసుకుంటారు. తీర్చేకాడికి వచ్చేసరికల్లా జారుకుంటారు. అటు పార్టీతోనూ, ఇటు మీతోనూ పడలేక రెండేళ్ళుగా నా పొలం ఎండబెట్టుకున్నాను గదరా నా కొడకా, నిన్ను నిలువునా చంపి పాతరేసినా పాపం పోదు” అంటూ కుప్పకూలిపోయినోణ్ణి జుట్టు పట్టి పైకి లేపి రెండు చేతుల్తోనూ బలంగా గొంతు పిసికే సమయంలో ఒక్కసారిగా అందరూ దూరి బలవంతంగా వారిని విడదీశారు.

“మీకేం తెల్సు ఈ నాకొడుకు మాకు చేసిన ద్రోహం! మీరు మాకు అడ్డు రావద్దు... ఇది వీడూ మేము తేల్సు కోవాలి”

ఎలాగైతేనేం, అందరూ పట్టుబట్టి వారిని విడదీసి సర్దిచెప్పడం, వారు ఏమాత్రం ఒప్పుకోకపోవడం చివరికి పోలీసులు, ప్యాసింజర్సు, డ్రైవర్, కండక్టర్ అందరూ కల్సి ఆవేశంతో ఊగిపోతున్న ఆ ఇద్దర్నీ కొంత స్వాంతన పర్చి కూర్చోబెట్టారు.

తన్నులతో, దెబ్బలతో కుప్పకూలిపోయిన ఈ సజీవ కళేబరాన్ని సీట్లో కూర్చోబెట్టి ముఖం మీద నీళ్ళు చల్లి తెప్పరిల్లేటట్లు చేశారు.

ఎట్టకేలకు బస్సు ముందుకు సాగిపోయింది.

అందరూ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

బస్సు చౌటిపల్లె దగ్గర ఆగగానే ఆ ఆగంతకులిద్దరూ దిగడానికి లేచారు. దిగబోతూ మళ్ళీ వాడివైపు గుడ్లురిమి చూస్తూ “నా కొడకా, ఈళ్లందరూ చెపితే వదిలిపెట్టినాం, రేపు నీ పెళ్ళాం బిడ్డలతో ఊరికి రాకపోయావో, నువ్వెక్క డున్నా సరే అక్కడికే వచ్చి యాట కొడవలితో నరికేస్తాం తెలిసిందా!” అంటూ హెచ్చరిక చేసి దిగిపోయారు.

వారు దిగిపోగానే బస్సులో ఒకటే కలకలం.

దెబ్బలు తిన్న వానిపట్ల సానుభూతితోనూ, పరామర్శ లతోనూ ముంచెత్తుతున్నారు.

వాడికివేం పట్టలేదు. ఆ చూపు ఎక్కడో వుంది. వొళ్ళంతా దెబ్బలతో కుదుములు కట్టింది. మూలుగు తున్నాడు.

బస్సు కొండాపురంలో ఆగింది. టీ, కాఫీల కోసం అందరూ దిగారు.

నేను దిగకుండా, ఎదురుగా ఉండే టీకొట్టులోని కుర్రా డిని పిలిచి రెండు టీలు పట్రరమ్మని చెప్పాను. వాడు తెచ్చాడు.

నేను ఒకటి తీసుకొని, మరొకటి దెబ్బలతో మూలుగు తున్న అతనికి తాగించబోయాను. వాడు కూర్చునే శక్తి కూడా లేక కూలబడిపోతున్నాడు. వణికే పెదవుల్తో టీ చప్పరించాడు.

నేను నా సీటును వదలి అతని సీటులో కూర్చున్నాను.

అతని ప్రక్కన కూర్చున్న మనిషి నా సీటులో కూర్చు న్నాడు.

బస్సు కొండాపురం దాటి కడప రోడ్డు వైపు సాగి పోతూ వుంది.

టీ తాగాక, సేదదీరిన తర్వాత అతణ్ణి అడిగాను.

“ఏమిటి నీ పరిస్థితి? వారికి నీ మీద ఎందుకంత ద్వేషం. ఎందుకు నిన్నలా గొడ్డుకంటే హీనంగా బాదా రు?”... అని అడిగాను.

అతనేమనుకున్నాడో ఏమో! ఓసారి నా ముఖం వైపు పరిశీలనగా చూసి...

“ఏం సెప్పాలయ్యా మీరు పెద్దోళ్ళు, మా పేదోళ్ళ పరిచ్చితి రోజురోజుకూ దిగజారిపోతుంది... అందునా మా కడజాతి వాళ్ళంటే అందరికీ అలుసే” అన్నాడు.

## మాటువృలు

1\. ‘సెక్సాట జోకరొచ్చిన
సిక్టీపర్‌సెంటు పెయిర్సు సీక్వెన్సులగున్’
టెక్ష్‌మొ చెప్పె నిట్టుల
ఎక్ట్సెన్షను రాకవాడు ఎకరాలమ్మెన్

2\. గింజంత దోమ కుట్టిన
గుంజవలెన్ ఏన్గుకాలు గొన కొని రాగన్
సంజయ కారణమేమది?
కుంజర యూథంబు దోమ కుత్తుక జొచ్చెన్

3\. పిజ్జా బర్గరులను తిను
ఉజ్జాయింపుగను వచ్చు యూయస్సు
(యుఎస్) స్టయిల్
గజ్జల నిక్కరు ఐసర
బొజ్జాయని చేయు నిన్ను పూర్తి అమెరికన్

4\. డెబొనాయిర్ పేజీల్లో
నబట్టలన్ వీడినట్టి నాతుల బొమ్మల్
ఉబలాటమ్మున చూస్తూ
గబగబ మూసేరు, నాటి కాలేజ్ కుర్రల్

5\. లేకున్న ‘బండిరా’, భా
షా కాంతకు లోటు కొన్ని సందర్భాల్లో
వాకొన అయిదున్నొకటిని
రాకుండునె గొడవ బండి రా వాడని చోన్

6\. బిడ్డల సహజ డెలివరీ
బొడ్డును చూపని సినీమ పోరియు, నగరిన్
లిడ్డున్న ‘మ్యానుహోలు’ను
వడ్డించెడి పెండ్లి పంక్తి - వార్తలె యికపై

7\. పని మానివేసి సమ్మెల
కొనసాగిన ఊడు కొల్వు; గోపురములపై
చని, బెదరించిన దూకెద
నని, కార్యము సఫలమగును ఆజోకల్ బేటా!

8\. స్లిమ్మింగ్ సెంటర్, ఫోటో
ఇమ్మన నా యింతి యుబ్బి ఎందుకనడిగెన్
‘అమ్మా! ఇది ట్రీట్‌మెంట్ ముం
దిమ్మాదిరి యుందురనెడి ‘ఏడ్’ కొరకనియెన్

–‘నిశాపతి’

"చూదు వీరయ్యా, విషయమేమిటో నాతో చెప్తావా?" అన్నాను.

"నా బాధ సెప్పుకుంటే మాత్తరం తీరుతుందా, మీరేం జేచ్చారయ్యా ఆర్సేవాళ్ళా, తీర్సేవాళ్ళా"... అన్నాడు నిర్వికారంగా.

బస్సులో ఎవ్వరూ మా సంభాషణను పట్టించుకోలేదు.

అందరూ ఎవరి ధోరణిలో వాళ్ళున్నారు.

"లేదు వీరయ్యా, సాటి మనిషిగా నాకు చేతనైనంత సహాయం చెయ్యాలేనా"

"అది ఎవళ్ళకు సాద్దెం కాదులే బాబయ్యా. అయినా మీరు అదుగుతూండారు కాబట్టి సెప్తాను ఇనుకోండి, మా కట్టనట్టాలు మీకెందుకు కట్టబెట్టాల" అని మొదలు పెట్టాడు.

"మాది తాడిపత్రి దగ్గర వెంకటరెడ్డిపల్లె. ఇదిగో ఇప్పుడు బస్సులో ఎక్కిన పెద్దమనిషి పేరు సంజీవరెడ్డి. ఆ గ్రామానికి పెద్ద మోతుబరి ఆసామి. ఆ వూర్లో ఎప్పటినుంచో ఈ సంజీవరెడ్డికీ, సుబ్బారెడ్డికీ పార్టీ వుంది. ఇద్దరి వైపునా ఇరవై మందిని సంపుకున్నారు. ఇల్లు కాల్చుకున్నారు, పొలాలు ఎండబెట్టుకున్నారు, కోర్టుల్లో కేసులు నడుస్తాండాయి. మేం, మా తరమంతా ఈ సంజీవరెడ్డి కాదనే పాలేర్లమై పడివుండాం, ఎప్పుడో మా యబ్బ చేసిన అప్పుకు మా నాయన బతుకంతా ఈయన కాడనే రెక్కలు ముక్కలు చేసుకోని ఎల్లబారి పోయినాడు. అప్పు తీరలేదు. నేనూ, నా పెళ్ళాం, బిడ్డలు కూడా ఆయన దగ్గరే పడుండి రేయింబవళ్ళు కట్టం చేసినా బాకీ తీరలేదు. అది అనుమంతుని తోకలాగా పెరిగిపోతూనే వుంది. మాకు సెప్పేవాళ్ళూ లేరు, మమ్మల్ని రచ్చించేవాళ్ళే లేరు. వాళ్ళ పార్టీల మధ్య నలిగి మా దాయాదులంతా చచ్చిపోయారు. పానాలతో మిగిలింది నా ఒక్క కుటుంబమే సారూ, కట్టానికి నేనెప్పుడూ బయపళ్ళేదు సారూ, వాళ్ళ పార్టీలకు బలైపోయిన మా వాళ్ళను తల్సుకొని నాకూ ముప్పు తప్పదనుకున్నాను. ఓ అద్దరేతిరి కాద పెళ్ళాం పిల్లలతో వూరిడిసి వచ్చినామయ్యా. నా పెళ్ళాం, పిల్లలు కడపలో బుగ్గవంక కాద గుడిసె వేసుకొని కూలిసేసుకొని బతుకుతా వుంటే నేను పరాయి దేశం పోయి కూలిపని చేసుకోని, ఇదో ఈ రెండు మూటలు కూలిగింజలు సంపాయించుకొని ఇంటికి పోతుండానయ్యా. నా భార్యా బిడ్డల్ని సూడక మూన్నెళ్ళయింది.

ఇదో ఇప్పుదు వాళ్ళ కంటబడినాను. ఆళ్ళ పెతాపం నా మీద ఎట్టా సూపించినారో మీకు తెల్సిందే గదా సారూ, మా బతుకంతా వారికాడ ఎట్టిసాకిరీ చేసినా ఆ అప్పు తీరదు, మా కడుపు నిండదు. పైగా పార్టీలో అవతలి గుంపు మాలాంటోళ్ళనే బలితీసుకుంటాది. ఆ వూర్లో ఇరవై ఏళ్ళ కాన్నుంచీ పార్టీ వున్నా నాయకులెవరూ సావలేదు. మాలాంటోళ్ళనే సంపేసినారు. ఇది సారూ నా పరిచ్చితి."

అయినా నా దురదుట్టానికి మీరేం జేచ్చారులే" అంటూ నిట్టూర్చి... దీనంగా నావైపు చూశాడు వీరయ్య.

"మరి ఇప్పుడు నువ్వేం చేయాలనుకుంటున్నావ్ వీరయ్యా"

"ఏం సేయాలో సేతులాడ్డం లేదయ్యా" ఆ వూరికి పోకపోతే ఎక్కడున్నా నన్ను పట్టుకొని నరికేచ్చారు, పోతే ఆ కట్టంలోబడి, ఆ పార్టీలో నలిగి సావాల్సిందే.

ఎట్టాగూ సావు తప్పదు. ఇంటికి పోయి నా పెళ్ళాం బిడ్డలతో ఆ వూరికి పోవాలా వద్దా అని ఆలోసించుకుంటాం."

వీరయ్య పరిస్థితి అంతా విన్న తర్వాత నాలో కలవరం రేగింది.

ఈ వ్యవస్థలో వెట్టిచాకిరీ ఇంత వికృతరూపంలో వుందా?

చట్టాలైతే తీసుకొచ్చారు, ఆచరణలో సాధించలేక పోతున్నారు.

నాకిది అర్థంకాని, విడదీయరాని చిక్కు సమస్యగా తోచింది.

లక్ష్మీరంగహాలు, దిగేవాళ్ళుంటే ఇక్కడే దిగండి, ఇంకెక్కాడా ఆగదు బస్సు. నేరుగా ఆర్టీసీ బస్టాండుకు పోతుంది.

కండక్టర్ కేకతో ఉలిక్కిపడి లేచి బస్సు దిగాను.

అప్పటికే నా పక్కనున్న వీరయ్య ఎప్పుడో దిగిపోయాడు.

ఆ రోజంతా అన్యమనస్కంగానే నా పనులు పూర్తి చేసుకొని రాత్రికల్లా ఇంటికి తిరిగొచ్చాను.

బస్సులోని వీరన్న దళిత స్వరం నన్ను దీనంగా వెంటాడుతున్నట్టే నని పించింది.

యథావిధిగా యాంత్రిక జీవితం. రోజూ డ్యూటీకి వెళ్ళడం, సాయంత్రానికి ఇల్లు చేరుకోవడం... ఇలా వారం రోజులు గడిచాయి.

అనుకోకుండా ఓ రోజు న్యూస్ పేపరు తిరగేస్తూంటే ఓ పెద్ద ఫోటో హృదయ విదారక దృశ్యమై కలిచివేసింది. ఆ ఫోటో కింద పెద్ద పెద్ద అక్షరాలతో "ఓ దళిత కుటుంబం ఆత్మహత్య" అని రాసి వుంది. ఆత్రంగా చదివాను. కడపలోని బుగ్గవంకలో దిక్కులేని నాలుగు శవాలు బయటపడ్డాయి. మృతుడు ఎర్రరంగు బనియను వేసుకున్నాడు. అతనితోపాటు మరో స్త్రీ శవం, ఇద్దరు పిల్లల శవాలను ఎవరో వెలికి తీశారు. వీరు కావాలని ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రజలు చెప్పుకుంటున్నారు. వీరి ఆత్మహత్యలకు కారణాలు తెలియడంలేదు. శవాలను వారి తరఫు బంధువులెవరైనా వుంటే గుర్తుపట్టవలసిందిగా కడప రూరల్ ఎస్ఐ ప్రకటించారు.

ఎంత దారుణం...

వీరయ్య సకుటుంబంగా ఆత్మహత్య చేసుకోవడానికి నిర్ణయించుకున్నాడన్నమాట.

వాళ్ళకు ఇదే పరిష్కారమని భావించారా?

"మా కదజాతి వాళ్ళంటే అందరికీ అలుసే సారూ"

"ఆ వూరికి పోయినా, పోకపోయినా సావు తప్పదు, ఆల్ల సేతుల్లో ఎందుకు సావాలి?"

వీరయ్య దీనస్వరం నన్ను వెంటాడుతూనే ఉంది. ■

## చదువుల చెట్టు

ఒక పరీక్ష కోసం ఎంత సంసిద్ధత
కాలం చుట్టుకొచ్చిన అనేకానేక సంఘటనల సంచయనాన్ని
ముందు పరుచుకుంటూ...
తనలోని ఒక ఖాళీతనంతో నింపుకుంటూ గడియారం వెంట-
ఒకటి.. రెండు.. మూడు
పోటీకదా ఎంత చదివినా తక్కువే-!
గడియ పురస్తులేకుండా
మెషిన్లో కెక్కించి బయటకు వదిలేస్తున్నట్టు
అనివార్యంగా నీరసించి.. నీరసించి...
రాత్రుల్ని దిగమింగుతూ విద్యార్థి-!

○ ○ ○

బాల్యం నిజంగా మరపురానిదే
దేన్ని గుర్తుపెట్టుకుంటారు-?
మార్కుల తక్కెడతో చదువుల్ని తూస్తున్నప్పుడు
ఆటపాటల్ని గొలుసులతో కట్టేసుకోవాల్సిందే...
స్వేచ్ఛా రాహిత్యాన్ని తోడుకుని బందీలుగా బిగుసుకుపోవటమే-
పాఠాలు... పరిసరాలు... సమాజం తలో దిక్కు చూస్తుంటే...
చౌరాస్తాలో దారితప్పిన బాల్యం!
చిన్నతనాన బుజ్జగించి.. బుజ్జగించి.. అంటు కట్టిన చదువుల మొలక్
భయం భయంగా బయటకు తలెత్తి చూస్తూ...
అంగట్లో అందంగా కనిపించిందంతా
నాణ్యమైందెలా అవుతుంది?
ఇప్పుడు అందాల చదువులే అందర్నీ ఆకర్షిస్తున్నాయి!
మార్కుల భరోసాల కోసం
కరిగిపోతున్న బాల్యం అంచుల్లో...
ఒక పరీక్ష రాయటానికి.. రాసేవాడికీ..
ఇపుడెన్ని కాలపరీక్షలో...!?

-మోతుకూరి అశోక్ కుమార్